కార్పొరేటర్ దృష్టికి కాలనీ సమస్యలు



కార్పొరేటర్ లచ్చిరెడ్డితో హరిహరపురం కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ సభ్యులు

వనస్థలిపురం: హరిహరపురం కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ సభ్యులు శుక్రవారం కార్పొరేటర్ లచ్చిరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వారు కాలనీ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కాలనీలో వర్షపునీరు సాఫీగా వెళ్లేలా నాలాల్లో పూడిక తీయించాలని, సాగర్ కాంప్లెక్స్ నుంచి వచ్చే మురుగు సమస్యను పరిష్కరించాలన్నారు. అదే విధంగా కాలనీ అంతర్గత రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. పార్కు అభివృద్ధి, ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు శంకర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి సందీప్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి నరేష్‌కుమార్, కోశాధికారి రఘుపతి రావు, పృథ్వి, జ్యోతికుమారి, వనజాక్షి, దయాకర్‌రెడ్డి, ధర్మరాజు, మధుకర్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, రాములు, సుధాకర్ చారి, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి

లింగోజిగూడ: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు ఎంతో ఉపయోగపడుతుందని జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్, లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సాయినగర్ కాలనీకి చెందిన బిక్యానాయక్ థైరాయిడ్ కేన్సర్ సమస్యతో బాధపడుతూ హాస్పిటల్ చికిత్స చేయించుకున్నారు. చికిత్స అనంతరం కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డిని కలవడంతో వారు సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేయించారు. ఈ మేరకు మంజూరైన రూ.42,500 చెక్కును శుక్రవారం బిక్యానాయక్ అందజేశారు.

మలక్‌పేట పాఠశాలలో 93.1 శాతం ఉత్తీర్ణత నమోదు

మలక్‌పేట: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మలక్‌పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంచి మార్కులతో 93.1 శాతము ఉత్తీర్ణత సాధించారని ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి తెలిపారు. పరీక్షలకు 87 మంది విద్యార్థులు హాజరైతే 81 మంది ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. బాలురు 52మందికి గాను 48, బాలికలు 35 మందికి గాను 33మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. విద్యార్థిని పొలిచెర్ల మధూరి 539 మార్కులతో సైదాబాద్ మండల స్థాయిలో రెండోస్థానం నిలిచారన్నారు. తమ విద్యార్థి ఈ ఘనత సాధించడం సంతోషంగా ఉందన్నారు.

పేర్ల కోసం బీజేపీ నాయకుల ఆరాటం



వనస్థలిపురం: వనస్థలిపురం ఎన్జీవోస్‌కాలనీలో గ్రంథాలయ భవన నిర్మాణం కోసం ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి చేసిన కృషి వల్ల రూ.1.95 కోట్ల నిధులు మంజూరయ్యాయని బీఎన్‌రెడ్డినగర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి అన్నారు. గురువారం గ్రంథాలయ భవన నిర్మాణానికి జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో బీజేపీ నాయకులు కూడా పాల్గొన్నారని పేర్కొన్నారు. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ పేరును శిలాఫలకంపై చిన్న అక్షరాలతో పెట్టారని అదే రోజు సాయంత్రం శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం ఎంతవరకు సమంజసమని బీజేపీ నాయకులను ఆయన ప్రశ్నించారు. బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి చిల్లర రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. బీజేపీ నాయకులు పేర్ల కోసం అనవసర రాద్ధాంతాలు చేస్తున్నారని అన్నారు. ఎన్నో రోజులుగా వారు గ్రంథాలయ భవన నిర్మాణ పనులకు ఆటంకం కలిగిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు చింతల రవి కుమార్, నాయకులు అనిల్ చౌదరి, నిర్మలాదేవి తదితరులు పాల్గొన్నారు.

నూతన సీఎస్‌కు శుభాకాంక్షలు

చాదర్‌ఘాట్: నూతన సీఎస్‌గా నియమితులైన రామకృష్ణారావుకు టీఎన్జీఓఎస్ ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలుసిన టీఎన్జీఓఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ భాయ్, చిలు నర్సింహారెడ్డి పూలబొకే ఇచ్చి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగుల తరుపున శుభాకాంక్షలు తెలిపారు.



కులగణన చరిత్రాత్మక నిర్ణయం

• కేంద్ర ప్రభుత్వ ప్రకటనపై సర్వత్రా హర్షం • ప్రధాని మోదీ చిత్రపటాలకు పాలాభిషేకాలు



హస్తినాపురంలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న సామ రంగారెడ్డి, నాయకులు



చంపాపేట చౌరస్తాలో పాలాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి

హస్తినాపురం: కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టేందుకు తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేజీ మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. శుక్రవారం హస్తినాపురం పార్టీ అధ్యక్షుడు ఎరుకల మల్లేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ రోడ్డులోని శ్రీరమణకాలనీ ఆర్ఎస్ఎస్ జంక్షన్ వద్ద ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ... దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొట్టమొదటి సారిగా బీజేపీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని అన్నారు. ఈ కులగణనతో బీసీ సమాజం రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని గమనించిన బీజేపీ ప్రభుత్వం కులగణన ఒక్కటే పరిష్కారమని ఈ నిర్ణయం తీసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో గజ్జల రాజుగౌడ్, అమర్‌నాథ్‌రెడ్డి, గౌని వెంకటేశ్‌గౌడ్, జీవన్‌రెడ్డి, చంద్రకాంత్, సత్యనారాయణ యాదవ్, మల్లేశ్ యాదవ్, గోవర్ధన్ యాదవ్, నర్సింహగౌడ్, లక్ష్మీకాంత్‌రెడ్డి, కనకరాజు, రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **కేంద్ర ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం**

చంపాపేట: ప్రధాని నరేంద్రమోదీ జనగణనతో పాటు కులగణన చేయాలని నిర్ణయం తీసుకోవటం హర్షణీయమని కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చంపాపేట చౌరస్తాలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రధాని మోదీకి కృతజ్ఞత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు శ్రీనివాసనాయుడు, రామాపురం శ్రీనివాస్, యోగిరాజ్, వీరారెడ్డి, రాజేష్, రమేష్, అనిల్, సుశీల్ తదితరులు పాల్గొన్నారు.

◆ **జనగణనతో పాటు కులగణన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం..**

నాగోలు: జనగణనతో పాటు కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ శుక్రవారం మారుతీనగర్ చౌరస్తాలో సంబురాలు జరుపుకున్నారు. అనంతరం జిల్లా బీజేపీ కాటా విజయగౌడ్, డివిజన్ ఉపాధ్యక్షుడు తోట మహేందర్‌యాదవ్‌తో కలిసి ఆయన ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్లయినా ఇప్పటి వరకు కులగణన జరగలేదని కార్పొరేటర్ అన్నారు. ఏడున్నర దశాబ్దాల తర్వాత భారత ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన విఫలం అయ్యిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిజమైన కులగణన చేపట్టి కులాల వారీగా ప్రభుత్వ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట అధ్యక్షుడు మంచి రాజేష్, నాయకులు జంగారెడ్డి, వజీర్ కుమార్, అంబాల మల్లేష్, సత్యనారాయణ, సుందర్ నారాయణ, గట్టు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

◆ **కేంద్రం నిర్ణయం తీసుకోవడం సంతోషంగా ఉంది: యశ్‌పాల్‌గౌడ్**

నాగోలు: స్వర్గీయ సుష్మాస్వరాజ్ కులగణన జరగాలని... బీజేపీ అధికారంలోకి రాగానే కులగణన చేపడతామని పదేళ్ల కిందటే ఆమె ప్రకటించారని బీజేపీ సీనియర్ నేత యశ్‌పాల్‌గౌడ్ అన్నారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం సంతోషంగా ఉందన్నారు. కేంద్ర నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాచకొండ రాధిక, కిరణ్‌కుమార్, అజయ్‌సింగ్, సంపత్‌గౌడ్, విష్ణు, మల్లికార్జున్, మనోజ్, యశ్వంత్, బన్నీ, కిరణ్, రామ్ చరణ్, కార్తీక్, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

◆ **కులగణన నిర్ణయం శుభపరిణామం: బొడ్డుపల్లి కృష్ణ**

దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని కేంద్రమంత్రి వర్గం తీసుకున్న నిర్ణయానికి బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. బీసీ మేధావులు, బహుజన నాయకులు, బీసీ సంఘాలు అనేక రూపాల్లో చేపట్టిన ఉద్యమాల కారణంగా కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టాలని నిర్ణయం తీసుకోవడం శుభపరిణామమని అన్నారు. ఈ నిర్ణయం బీసీ చైతన్యానికి గుర్తుగా భావించాలన్నారు. బీసీల హక్కులు, సమస్యలు రిజర్వేషన్లు, బడ్జెట్ కేటాయింపులు, ఉద్యోగాలు విద్య, వైద్యం రాజకీయం తదితర రంగాల్లో 'మనం ఎంతో... మనకంతా..'దక్కే వరకు బీసీలు వెనకడుగు వేయొద్దని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చంపాపేట: విద్యుత్ మరమ్మతుల పనుల కారణంగా చంపాపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

◆ చంపాపేట, సుల్తానాఅల్వా విద్యుత్ ఫీడర్ల పరిధిలోని కటకోనికుంట, చంపాపేట పాతబస్తీ, సాయిరాంనగర్, సుల్తానాఅల్వా, రాజిరెడ్డినగర్, శిఖరాఎన్‌క్లేవ్, నాగార్జున, ఆర్టీసీ, భానునగర్, కేశవనగర్, సింగరేణి, రాఘవేంద్ర కాలనీలలో ఉదయం 9 నుంచి 10గంటల వరకు...

◆ శ్రీనివాసనగర్ ఫీడర్ పరిధిలోని గ్రీన్‌పార్క్, శ్రీనివాసనగర్, శ్రీరాం, తపోవన్‌కాలనీల్లో ఉదయం 10 నుంచి 11గంటల వరకు...

◆ వినయ్‌నగర్ ఫీడర్ పరిధిలోని కృష్ణానగర్, వినయ్‌నగర్, ఎన్ఎస్పార్, బీఎస్ఎన్ఎల్, శ్రీనివాసనగర్, బాలాజీనగర్ కాలనీలలో సాయంత్రం 3.30 నుంచి 4.30గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఆస్మాన్‌గడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో...

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, పలు మరమ్మతు కారణంగా ఆస్మాన్‌గడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

◆ ఐబీపీ పెట్రోల్ పంప్, 7బీ గ్రైండ్, ఎస్‌బీఐ బ్యాంక్, క్రిస్టల్ బార్, ఎస్ఎన్ఆర్ లైబ్రరీ, ఐఎస్ సదన్ క్రాస్ రోడ్, ఐఎస్‌సదన్ మెయిన్ రోడ్ ఉదయం 9 నుంచి 11గంటల వరకు...

◆ పద్మావతి కాలేజ్, ఇంద్రప్రస్థ ఫేజ్-2, సుబ్రమణ్యనగర్, కరణ్‌బాగ్ ఉదయం 10 నుంచి 11గంటల వరకు...

◆ సిరిపురంకాలనీ, ఫ్రెండ్స్ కాలనీ, ఈస్ట్ ప్రశాంత్ నగర్, అరోరా కాలేజ్ ఆపోజిట్, రామాలయం టెంపుల్ పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని అన్నారు.

ఐఎస్‌సదన్‌లో సన్నబియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కోట్ల శ్రీనివాస్



ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ పరిధిలో రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నేతలు



సన్నబియ్యం పంపిణీ ఘనత కాంగ్రెస్‌దే..

మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కోట్ల శ్రీనివాస్

సైదాబాద్: దేశంలో మరెక్కడా లేనట్లుగా తెలంగాణలో పేదలకు సన్నబియ్యం పంపిణీ పథకం ప్రవేశపెట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఐఎస్‌సదన్‌లోని పలు రేషన్ షాపుల్లో ఆయన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అన్నివర్గాల అభ్యున్నతి కోసం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అదే విధంగా సన్నబియ్యం పండించే ప్రతి రైతుకు ఎకరానికి రూ.500 ఇస్తామని ముఖ్యమంత్రి ప్రకటించటంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నగరిగారి దాస్, కోట్ల లడ్డాపటేల్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి...

చాదర్‌ఘాట్: ప్రభుత్వ పథకాలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ నాయకులు అన్నారు. శుక్రవారం ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ పరిధిలోని పలు దుకాణాల వద్ద వారు లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాబు శ్రీనివాస్, చౌకి రవికుమార్, ఆకుల రాజు, నరేందర్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



భీంరావు(ఫైల్)

హస్తినాపురం: ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... హరిహరపురంకాలనీలో నివాసం ఉంటున్న భీంరావు(55) మేస్త్రీ పని చేసుకుంటూ తన భార్య రేణుకతో కలిసి నివాసం ఉంటున్నాడు. గత నెల 29న ఉదయం 11గంటల సమయంలో పనిమీద బయటికి వెళ్తున్నానని చెప్పి తిరిగి ఇంటికి రాలేదు. భీంరావుకు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ రావడంతో ఆందోళన చెందిన భార్య రేణుక ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వేసవి శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఈఓ రాధాకృష్ణ, హెచ్‌ఎం విజయలక్ష్మి

మలక్‌పేట: ప్రభుత్వ కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సైదాబాద్ డీఈఓ తిరునగరి రాధాకృష్ణ అన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో మలక్‌పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 'సమ్మర్ క్యాంపు'ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. సమ్మర్ క్యాంపులో వివిధ అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇస్తారన్నారు. యోగా, మెడిటేషన్, స్పోకెన్ ఇంగ్లిష్, మ్యాథమెటిక్స్ పజిల్స్, సైన్స్ ప్రయోగాలు, కంప్యూటర్, ఆర్ట్స్, మోహందీ, ఎంబ్రాయిడరీ, పేయింటింగ్ మొదలగు వాటిని నేర్పిస్తారని తెలిపారు. హెచ్‌ఎం విజయలక్ష్మి మాట్లాడుతూ.. మే 15 తేదీ వరకు ఉదయం 8 నుంచి 11గంటలకు శిక్షణ ఉంటుందన్నారు. విద్యార్థులకు ఉదయం స్నాక్స్ కూడా అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఐవోఎస్ వరప్రసాద్, ఇన్‌చార్జి శ్రీనివాస్, పీడీ రంజిత్‌కుమార్, స్వరూప, ఇన్‌స్ట్రక్టర్ సుధా పాల్గొన్నారు.

ఎల్బీనగర్ ఫ్లైఓవర్‌పై కారు బీభత్సం

ముగ్గురికి గాయాలు.. కేసు నమోదు చేసిన పోలీసులు



నాగోలు: మద్యం మత్తులో ఓ వ్యక్తి గురువారం రాత్రి 11.30 గంటల సమయంలో కారును అతివేగంగా నడుపుతూ ఎల్బీనగర్ కామినేని ఫ్లైఓవర్‌పై బీభత్సం సృష్టించాడు. రెండు బైకులను ఢీకొట్టి కారుతో డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో బైకులపై ఉన్న ఇద్దరు యువకులతో పాటు కారు నడుపుతున్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. ఫ్లైఓవర్‌పై సుమారు అరగంట ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఉప్పల్ బాగాయత్‌కు చెందిన కారు డ్రైవర్ బి.ప్రభాకర్‌రెడ్డికు డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష నిర్వహించగా 190 ఆల్కహాల్ కౌంట్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు ఎల్బీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సంఘటనలో బైకులపై ఉన్న శివకుమార్, విజయ్‌కుమార్‌లను కామినేని ఆస్పత్రికి తరలించారు.

రామకృష్ణాపురం డివిజన్‌లో సమస్యలను పరిష్కరిస్తాం

జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్



ఆర్‌కేపురం ఇన్‌కమ్‌ట్యాక్స్ కాలనీ మార్నింగ్ వాక్‌లో సమస్యలు తెలుసుకుంటున్న జెడ్‌సీ

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణాపురం డివిజన్‌లో ఇన్‌కమ్‌ట్యాక్స్ కాలనీలో శుక్రవారం జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, సరూర్‌నగర్ డీసీ సుజాత శ్రీధర్, ఇతర టౌన్‌ప్లానింగ్, ఇంజినీరింగ్ అధికారులతో మార్నింగ్ వాక్ చేసి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీలోని సమస్యలను స్థానికులు అధికారులకు వివరించారు. త్వరలో సమస్యలను పరిష్కరిస్తానని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణాపురం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పున్న గణేష్, నేత సొసైటీ అధ్యక్షుడు రామారావు, శ్రీప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం ధర్మకర్తలు వెంకటేశ్వర్లు, అన్నపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై భరత్

కులం పేరుతో దూషించే వారు శిక్షార్హులు

చాదర్‌ఘాట్: కులం పేరుతో దూషించిన వారు పౌర హక్కుల చట్టం ప్రకారం శిక్షార్హులని అంబర్‌పేట డిప్యూటీ తహశీల్దార్ బలరాం అన్నారు. ఓల్డ్ మలక్‌పేటలోని వాటర్ పంప్‌హౌస్ వద్ద నిర్వహించిన పౌర హక్కుల పరిరక్షణ దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. సమాజంలో అంటరానితనాన్ని రూపుమాపేందుకు ఈ చట్టాలు ఎంతో దోహదపడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో చాదర్‌ఘాట్ ఎస్సై భరత్, బస్తీవాసులు పాల్గొన్నారు.

నిరసన ర్యాలీ



దిల్‌సుఖ్‌నగర్ డే జోన్ శ్రీచైతన్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం ఉగ్రదాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఆర్‌కేపురం విక్టోరియా మెమోరియల్ మెట్రో స్టేషన్ నుంచి మొదలై బీజేఆర్ భవనం వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. ఈ ర్యాలీలో జోన్ డీన్ ఆదిరెడ్డి, ఏజీఎంలు, ప్రిన్సిపాల్స్, లెక్చరర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. – దిల్‌సుఖ్‌నగర్

కల్యాణం.. కమనీయం

కనులపండువగా లక్ష్మీనారాయణ కల్యాణ మహోత్సవం



హనుమత్ వాహన సేవలో భక్తులు



అష్టలక్ష్మీ దేవాలయంలో శ్రీలక్ష్మీనారాయణ కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని వాసవీకాలనీలో ఉన్న అష్టలక్ష్మి దేవాలయంలో 29వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం రాత్రి శ్రీలక్ష్మీనారాయణ కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. శుక్రవారం వరాహ ఇష్టి, సింహ వాహనసేవ, రథోత్సవం ప్రధాన అర్చకులు లక్ష్మీనరసింహచార్యులు నిర్వహించారు. ఈ పూజల్లో ఆలయ చైర్మన్ సోమ సురేష్‌కుమార్, ఫౌండర్ చైర్మన్ గౌరీశెట్టి చంద్రశేఖర్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అంజయ్య, కమిటీ సభ్యులు దాచేపల్లి శ్రీనివాసు, గౌరిశెట్టి అరుణ్ కుమార్, చిలుక ఉపేందర్‌రెడ్డి, ఉమాపతిరావు, సుదర్శన్, గ్రంథి రమేష్, మాలే శ్రీనివాస్, సత్యనారాయణ, శ్రవణ్, శ్రీధర్, రామ్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల పునర్ నిర్మాణానికి సహకారం అందిస్తా: ఎమ్మెల్యే

మన్సూరాబాద్: డివిజన్ పరిధిలోని జడ్జెస్‌కాలనీ ఫేజ్-1లోని ఎల్లమ్మ, బంగారు పోచమ్మ దేవాలయాల పునరుద్ధరణ పోస్టర్‌ను ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... దేవాలయాల పునర్ నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తామన్నారు. ఈనెల 4వ తేదీన పునర్ నిర్మాణం జరగటం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అంజయ్యగౌడ్, కార్యదర్శి బాలయ్య, కోశాధికారి రంగారెడ్డి, దేవాలయాల పునర్‌నిర్మాణ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీవిజయదుర్గా దేవాలయ వార్షికోత్సవం



సైదాబాద్: సైదాబాద్ మాతా మైదాన్‌లో కొలువుదీరిన శ్రీవిజయదుర్గా మాతా దేవాలయ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. నిర్వాహకులు ఆలయాన్ని విద్యుద్దీపాలు, పూలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచే భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు.



జడ్జెస్‌కాలనీలో దేవాలయాల పునర్‌నిర్మాణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి